క్లుప్తంగా

బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు



పెద్దఅంబర్‌పేటలో తనిఖీ చేస్తున్న పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్: బెల్ట్‌షాపుపై గురువారం హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేటలోని ఓ కిరాణ దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా 57 మద్యం సీసాలు లభించాయి. దీంతో పాటు తారమతిపేట గ్రామంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న 500 లీటర్ల కల్లును గుర్తించి పారబోసినట్లు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ హనుమంతు, సిబ్బంది పాల్గొన్నారు.

యాచారంలో॥

యాచారం: మండల పరిధిలోని బెల్టు దుకాణాలపై బుధవారం యాచారం పోలీసులు దాడులు నిర్వహించారు. నస్దిక్‌సింగారంలోని శ్రీనివాస్ ఇంట్లో 27 మద్యం బాటిళ్లు, యాచారంలోని వెంకటమ్మ నివాసంలో 36 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా బెల్టు దుకాణాలు నిర్వహిస్తే బాధ్యులైన వారిపై కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

ఓటు హక్కు అందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్...



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్

తుర్కయంజాల్: 30వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ సూచించారు. గురువారం తుర్కయంజాల్‌లోని మున్సిపల్ కార్యాలయంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సదర్



ఆర్థిక సాయం అందజేస్తున్న రంగారెడ్డి

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సదరస్ సంబురాలు నిర్వహిస్తున్నట్లు యాదవ సంక్షేమ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు శేఖర్ యాదవ్ గురువారం తెలిపారు. అయితే ఈ వేడుకకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రూ.లక్ష, గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పాండురంగారెడ్డి రూ.50వేలు ఆర్థిక సహాయం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న ఆర్‌ఐ

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పసుమాములలో సర్వే నంబర్ 47, 386, కుంట్లూర్‌లో 37, తట్టిఅన్నారంలో 127/1 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూముల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను గురువారం మండల ఆర్‌ఐ మహ్మద్ నిజాముద్దీన్ కూల్చి వేయించారు. ఎన్నికల హడావుడిని అవకాశంగా తీసుకొని ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడుతుండడంతో వచ్చిన ఫిర్యాదుల మేరకు సిబ్బందితో కలిసి కూల్చి వేయించినట్లు ఆర్‌ఐ తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇసుక లారీ సీజ్

తలకొండపల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మండల పరిధిలోని పడకల్ నుంచి హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. అనంతరం వాటిని సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఎన్నికల వే'ఢీ'

- పట్నంలో హోరాహోరీ పోరు
- ఢీ అంటే ఢీ అంటున్న కిషన్‌రెడ్డి, మల్‌రెడ్డి
- జోరందుకోనున్న ఎన్నికల ప్రచారం
- పోలీస్‌శాఖ అలర్ట్



ఇబ్రహీంపట్నం ప్రధాన కూడలి

యాచారం: ఇబ్రహీంపట్నంలో గురువారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా ఇరుపార్టీల కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలు ఉద్రిక్తతకు దారి తీశాయి. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ విడులైనప్పటి నుంచి ఇబ్రహీంపట్నం రాజకీయం రసవత్తరంగా మారింది. శాసనసభ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు పావులు కదుపుతున్నారు. కొత్త వ్యూహాలతో ప్రత్యర్థులను హడలెత్తిస్తున్నారు. పట్నంలో నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఉవ్విళ్లూరుతున్నారు. మూడు దఫాలు ఓటమి చెవిచూసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ ఎన్నికల్లో గెలిచి.. కిషన్‌రెడ్డికి చెక్ పెట్టాలని పట్టుదలతో ఉన్నారు. రెండు పార్టీల అభ్యర్థులు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో నువ్వా.. నేనా అన్నట్లుగా గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమమే తనను భారీ మెజార్టీతో గెలిపిస్తుందని కిషన్‌రెడ్డి ధీమాగా ఉన్నారు. ఇకపోతే గతానికి భిన్నంగా పట్నం కాంగ్రెస్ నేతలు ఐకమత్యంతో బీఆర్‌ఎస్‌ను ఢీ కొడుతున్నారు. దీంతోపాటుగా కాంగ్రెస్‌లో చేరికల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇలా అన్ని అవకాశాలను అనుకూలంగా మార్చుకుంటున్నారు మల్‌రెడ్డి రంగారెడ్డి.

పోలీసులు అప్రమత్తత కాకపోతే...

ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దాడులు చేసుకున్నారు. ఈ ఘటనతో పోలీసులు అప్రమత్తం కాకపోతే మరిన్ని ఘర్షణలు జరిగే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. గురువారం కిషన్‌రెడ్డి, రంగారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అభ్యర్థులకు మద్దతుగా ఇరు పార్టీల కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. అయితే పోలీసులు బందోబస్తు విషయంలో మెతక వైఖరి కారణంగానే ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు వేయడం పూర్తి కావడంతో ఇక ప్రచార హోరు గ్రామాల్లో సాగనుంది. ప్రచారపర్వంలో నాయకులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే అవకాశం ఉంది. అందువల్ల పోలీసులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

పోరుగడ్డ

నియోజకవర్గంలో మొదటి నుంచి రాజకీయ చైతన్యం ఎక్కువే. ఒకనాడు ఈ ప్రాంతంలో కమ్యూనిస్టుల ప్రభావం అధికంగా ఉండేది. అప్పట్లో కాంగ్రెస్, సీపీఎం ఇతర పార్టీల మధ్య తీవ్ర ఘర్షణలు, దాడులు జరిగి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. యాచారం మండలం నక్కర్తమేడిపల్లి, మంతన్‌గౌరెల్లి, మొండిగౌరెల్లి, చింతపట్ల, నల్లవెల్లి, మంచాల మండలం జాపాల, మంచాల, ఆరుట్ల, చెన్నరెడ్డిగూడ, బండలేమురు, లోయపల్లి, బోడకొండ, ఎల్లమ్మతండా, చిత్తాపూర్, ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి, రాయపోల్, దండుమైలారం, ముకునూర్, కప్పాడు, ఏలిమినేడ్, పోచారం తదితర గ్రామాల్లో ఇరు పార్టీలు పోటాపోటీగా తలపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఈ ప్రాంతంలో కొంత ప్రశాంతత వాతావరణం నెలకొంది. ఇన్ని రోజులు ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో గురువారం జరిగిన ఘటనతో అందరూ ఆందోళన చెందుతున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

- అభివృద్ధి చేస్తా
- బీజేపీ అభ్యర్థి ఆచారి



ఎన్నికల ప్రచారంలో ఆచారి

కడ్తాల్: తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఆచారి ప్రజలను కోరారు. ఎమ్మెల్యే గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గురువారం మండల పరిధిలోని రేఖ్యాతాండ, పెద్దారెడ్డిచెరువుతాండ, కొండ్రిగానిబోడ్‌తాండ, వెలుగురాళ్ల, పిల్లిగుండు, టాక్‌రాజ్‌గూడ, గడ్డమీదితాండతో పాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా రైతులు, బలహీనవర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని, మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టి పాలనసాగిస్తోందని మండిపడ్డారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని జోస్యం చెప్పారు. కల్వకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి శంకర్‌నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు డాక్టర్ రమేశ్, మోహన్‌రెడ్డి, వీరయ్య, రాందాస్‌నాయక్, రెడ్యానాయక్, సాయిలాల్‌నాయక్, మహేశ్, సాయిలు, సాయి, భగీరథ్, రవి, వెంకటేశ్, నర్సిరెడ్డి, అభిలాష్, నరేందర్ తదితరులు ఉన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: పట్టణంలోని 15వ వార్డులో ఆచారికి మద్దతుగా మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు శ్రీకాంత్‌సింగ్, కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్, శ్రీశైలంయాదవ్, టిల్లుయాదవ్, గిరియాదవ్, రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'పట్నం' జనసంద్రం



ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్ ర్యాలీ



ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ ర్యాలీ

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ర్యాలీలు
- ఉప్పెనలా తరలివచ్చిన కార్యకర్తలు
- ఇరుపార్టీల శ్రేణుల్లో ఉత్సాహం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం జనసంద్రంగా మారింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి కార్యకర్తలతో ర్యాలీగా రావడంతో ఇబ్రహీంపట్నం పార్టీల జెండాలు రెపరెపలాడాయి. చర్లపటేల్‌గూడ రోడ్డు నుంచి ఇబ్రహీంపట్నం వైపు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రోడ్డు షో, ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ యువనాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వినూత్న రీతిలో ర్యాలీ కొనసాగింది. ర్యాలీగా వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

కదిలిన కాంగ్రెస్ శ్రేణులు

తొర్రూర్ గ్రామం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి భారీ కాన్వాయ్‌తో కదలివచ్చారు. బొంగ్లూర్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఎక్కడ చూసిన కాంగ్రెస్ జెండాలు దర్శనమిచ్చాయి. అధికార పార్టీకి ధీటుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో మల్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలతో ఇబ్రహీంపట్నం నిండిపోయింది. పార్టీ కార్యకర్తలు తీసిన ర్యాలీతో.. ఇరుపార్టీల నాయకుల్లో ఉత్సాహం ఉరకలేసింది.

'ఆరు'ప్రచార హోరు

- కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం
- కసిరెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం
- హస్తం పార్టీలో పలువురి చేరిక



నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ఆ పార్టీ నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ తిరుగుతూ వాగ్దాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రేమ్‌కాలనీలో గురువారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు కృష్ణనాయక్, కాలె మల్లయ్య, శ్రీకాంత్, ఖాదర్, రహీం, ఖరీం, నాజర్, ఫరీద్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

కసిరెడ్డి విజయం ఖాయం

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గంలో కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం ఖాయమని కాంగ్రెస్ నాయకులు ధీమావ్యక్తం చేశారు. గురువారం నారాయణరెడ్డికి మద్దతుగా మండల కేంద్రంలోని పలు కాలనీలతో పాటు, టాక్‌రాజ్‌గూడలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అసమర్థ పాలన సాగిస్తోందని, దీంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించారు. కసిరెడ్డి నారాయణరెడ్డిని గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, ఉప సర్పంచ్ శారద, నాయకులు జహంగీర్‌అలీ, మల్లయ్య, బుచ్చయ్య, సత్యంయాదవ్, మల్లేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కసిరెడ్డి సమక్షంలో చేరికలు

కడ్తాల్: కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలోకడ్తాల్, వంపుగూడ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాల్లో విఫలమయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌లో చేరడానికి ఉత్సాహం చూపుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారికి అధికారంలోకి రాగానే సముచిత స్థానం కల్పిస్తామని, పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మోత్యానాయక్ , యాట నర్సింహ, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్ ఉన్నారు.

'దేవునిమాన్యం' నుంచి విముక్తి

ఆమనగల్లు: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి దేవునిమాన్యం నుంచి విముక్తి కలిగింది. ఏడేళ్లుగా విద్యానగర్ కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు పాష, సభ్యుల చొరవతో కాలనీని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఆమనగల్లు పట్టణంలో సర్వే నంబర్ 1457, 1459లో విద్యానగర్ కాలనీ ఏర్పాటు చేశారు. ఇప్పటికే కాలనీలో ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ రెండు సర్వే నంబర్లలో ఉన్న విద్యానగర్ కాలనీ దేవునిమాన్యం పరిధిలో ఉన్నట్లుగా ప్రభుత్వం ప్రకటించడంతో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. అంతేకాకుండా కాలనీలో గృహ నిర్మాణాలకు అనుమతి కూడా ఇవ్వడం లేదు. దీంతో కాలనీని దేవునిమాన్యం పరిధి నుంచి తొలగించాలని కాలనీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఏడేళ్లుగా పోరాడారు. పోరాటం ఫలితంగా దేవాదాయ శాఖ మరియు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయాలు విద్యానగర్ కాలనీని దేవునిమాన్యం నుంచి తొలగించారు. మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌ను దేవునిమాన్యం నుంచి తొలగించిన ప్రభుత్వ ఉత్తర్వులను కాలనీ వాసులకు అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డతాండ, ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. కడ్తాల మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గంప వెంకటేశ్, తోట గిరియాదవ్, పత్యానాయక్, సయ్యద్ ఖలీల్, జీఎల్ఎన్‌రెడ్డి, ఎంగలి బాలకృష్ణయ్య, రఘు, శ్రీనునాయక్, పంతునాయక్, వస్పుల సాయిలు తదితరులు ఉన్నారు. అలాగే మండల పరిధిలోని కొత్తకుంటతాండలో గురువారం జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీఆర్‌ఎస్ అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావ్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, పోలేపల్లి ఎంపీటీసీ కుమార్, కొత్తకుంటతాండ సర్పంచ్ శోభ, నాయకులు నారాయణ, జాన్యానాయక్, సత్యంయాదవ్, లాలయ్య, శ్రీనివాసరావ్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ బీఆర్‌ఎస్

మాడ్గుల: కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్‌కు మద్దతుగా గురువారం మాడ్గుల మండల పరిధిలోని నాగిళ్ల గ్రామంలో వార్డు సభ్యుడు మహేశ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు

అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమావ్యక్తం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్తయ్య, గ్రామ అధ్యక్షుడు చెన్నయ్య నాయకులు చలమందగౌడ్, శ్రీను, వడ్డెమోని శ్రీను పాల్గొన్నారు.

డిసెంబర్ 1న సెలవు ప్రకటించాలి

మంచాల: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు డిసెంబర్ ఒకటో తేదీన సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించాలని పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మంచాలలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఈనెల 29, 30 తేదీల్లో ఎన్నికల విధులు నిర్వహిస్తారు. ఎన్నికల ప్రక్రియ పూర్తవ్వగానే ఎన్నికల సామగ్రిని అప్ప చెప్పి తిరిగి ఇంటికి చేరుకోవడానికి అర్ధరాత్రి అవుతుందన్నారు. మరుసటి రోజు పాఠశాలకు హాజరు కావడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు డిసెంబర్ ఒకటిన సెలవు ప్రకటించాలన్నారు.

పట్నంలో 19 నామినేషన్లు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి 19 నామినేషన్లను ఆయా అభ్యర్థులు అందజేశారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి (3సెట్లు), కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి, సీపీఎం పార్టీ అభ్యర్థిగా పగడాల యాదయ్య, స్వతంత్ర అభ్యర్థులు చిక్కుడు గుండాలు, కొంతం మాధవరెడ్డి, మాలోతు శివ, సందీప్‌రెడ్డి, వంగేటి నరేందర్ రెడ్డి, తులసిగారి రవీందర్, రావుల సాయికిరణ్, సుధాకర్‌రెడ్డి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

కల్వకుర్తిలో 9

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గురువారం 9 నామినేషన్లు దాఖలయ్యాయి. కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి శ్రీనుకు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు అందజేశారు. కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి తరపున ఆయన సతీమణి గీత, బీజేపీ నాయకులు కండె హరిప్రసాద్, కృష్ణయ్య, జానయ్య, రఘులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ప్రజాశాంతి పార్టీ నుంచి కట్ట జంగయ్య, ధర్మసమాజ్ పార్టీ నుంచి రమేశ్, భూర్యానాయక్, బహుజన సమాజ్‌పార్టీ నుంచి శ్రీనివాసులు, స్వతంత్ర అభ్యర్థులుగా ఆంజనేయులు, పాండురంగయ్య, యాదమ్మలు నామినేషన్లు దాఖలు చేశారు. పార్టీల అభ్యర్థులు ర్యాలీగా వెళ్లి నామినేషన్లు సమర్పించారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల మధ్యే పోటీ తీవ్రంగా ఉంది.

కరాటేతో ఆత్మరక్షణ



కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించిన మహేశ్

తలకొండపల్లి: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని, ప్రతిఒక్కరూ కరాటే నేర్చుకోవాలని కరాటే మాస్టర్ మహేశ్ సూచించారు. బాలబాలికలందరూ కరాటే తప్పనిసరిగా నేరుకోవాలన్నారు. గురువారం మండల పరిధిలోని చుక్కాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల్లో డీఈఓ ఆదేశాలతో ఉచిత కరాటే శిక్షణ తరగతులను ఆయన, హెచ్‌ఎం రామనాథంతో కలిసి ప్రారంభించారు. అమ్మాయిలపై జరుగుతున్న దాడులను ఎలా ఎదుర్కోవాలి.. విపత్కర పరిస్థితుల్లో ఎలా బయటపడాలో.. అనే దానిపై మెళుకువలు నేర్పుతూ శిక్షణ తరగతులను ప్రారంభించారు. బాలికలకు ఆపద వచ్చినప్పుడు కరాటే ఆత్మరక్షణగా ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శంకర్ శ్రీదేవి

ఇబ్రహీంపట్నం: లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి, అడిషనల్ సీనియర్ జడ్జి నాగరాజు, జూనియర్ సివిల్ జడ్జిలు యశ్వంత్‌సింగ్, హిమబిందు సూచించారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణ, నల్లకంచె బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చిన్న చిన్న విషయాలకు గొడవపడి కోర్టుల చుట్టూ తిరిగి డబ్బు, సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- అన్ని రంగాల్లో వెనుకబడ్డ కల్వకుర్తి
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అసమర్థుడు
- కసిరెడ్డి నారాయణరెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అభ్యర్థించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అసమర్థత వల్ల నియోజకవర్గం వెనుకబడిపోయిందని ఆరోపించారు. కల్వకుర్తి, ఆమనగల్లు మండలాల్లో వివిధ గ్రామాల్లో గురువారం నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే నారాయణరెడ్డి విస్తృతం ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని ఆరోపించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ82 కాలువను జైపాల్‌యాదవ్ ఐదేళ్లలో పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వెంటనే డీ82 కాలువను పూర్తి చేయి రైతులకు సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎన్నికల్లో తనను కసిరెడ్డి కోరారు. ప్రచారం కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

గెలుపు మాదే

తలకొండపల్లి: కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని చంద్రధన, పూలుసింగ్‌తాండ, నల్లరాళ్లతాండ, బద్యాతాండలో గురువారం రాత్రి కసిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి పెరిపోయిందని, అందువల్ల కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని, అధిక సీట్లు కైవసం చేసుకొని రాష్ట్రంలో, కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలను పక్కగా అమలు చేస్తామన్నారు. ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న సీఎం కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో భంగపాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీమ్లానాయక్, మాజీ ఎంపీటీసీ రాములు, రాజేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.